సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ శ్రేణులు

బహుజన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్
- జిల్లా వ్యాప్తంగా పాపన్నకు ఘన నివాళి

హనుమకొండ, ఏప్రిల్ 2 : బహుజన వీరుడు, ఓరుగల్లు పోరుబిడ్డ, ఆత్మగౌరవ యుద్ధ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా బుధవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో దాస్యం పార్టీ శ్రేణులతో కలిసి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దక్కన్ గడ్డపై మొదటిసారిగా బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. ఒక సాధారణ కులంలో జన్మించి ఆనాటి సామాజిక వ్యవస్థలో ఉన్న ఆధిపత్య కులాల అధికారాన్ని ధిక్కరించి దళిత, బహుజనులను రాజ్యాధికారం వైపు నడిపిన తొలి బహుజన రాజు అని అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, సల్వాజీ రవీందర్‌రావు, రామ్మూర్తి, ఇమ్మడి లోహిత-రాజు, రఘు పాల్గొన్నారు. పాపన్న గౌడ్ బహుజనుల కోసం పోరాడాడని డీఆర్వో గణేశ్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతులు, సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్వో పాపన్న చిత్రపటానికి పుష్పాలతో నివాళుర్పించారు. డీఆర్డీవో శ్రీను, జిల్లా ట్రెజరీ ఆధికారి శ్రీనివాస్ కుమార్, జడ్పీ సీఈవో విద్యాలత పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా స్పెషల్ రైళ్ల పొడిగింపు

కాజీపేట, ఏప్రిల్ 2 : కాజీపేట మీదుగా ఉత్తర భారతానికి నడుస్తున్న సుబేదార్‌గంజ్-సికింద్రాబాద్ వారాంతపు స్పెషల్ రైలును మరో రెండు నెలల పాటు పొడిగించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రస్తుతం 04121 నంబర్‌తో ఏప్రిల్ 3 నుంచి మే నెల 29వ తేదీ వరకు సుబేదార్‌గంజ్ రైల్వే స్టేషన్ నుంచి ప్రతి గురువారం, 04122 నంబర్‌తో ఏప్రిల్ 5 నుంచి మే 31వ తేదీ వరకు ప్రతి శనివారం సికింద్రాబాద్ నుంచి బయలు దేరుతుందన్నారు. ఈ రైలు రాకపోకల్లో గోవింద పురి, భీంసేన్, పోకర్యాన్, ఓరాయ్, ఝాన్సీ, బీన, రాణ, కమలాపాటి, ఇటార్సీ, నాగపూర్, బల్లార్షా, సిర్‌పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి, కాజీపేట రైల్వే స్టేషన్లలో ఆగుతుందని తెలిపారు. ఈ రైలుకు 3 ఏసీ, సీఫ్లర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలుంటాయని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సుబేదారి, ఏప్రిల్ 2 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. హనుమకొండ పోలీసుల కథనం ప్రకారం ధర్మసాగర్‌కు చెందిన కొట్టె పుష్ప(52) మంగళవారం రాత్రి కేయూ వద్ద రోడ్డు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన మహిళ హాస్పిటల్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో కారు డ్రైవింగ్ చేసిన బజంతిరి కోటేశ్వర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, ఏప్రిల్ 2 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు ప్రగతినగర్, రెవెన్యూకాలనీ, సాయికాలనీ, నాగేంద్రనగర్, జూలైవాడ ఏరియా, రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియాలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు, సోమిడి, వడ్డేపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 నుంచి 10గంటల వరకు సోమిడి, జూబ్లీమార్కెట్, రహ్మత్‌నగర్, కాజీపేట మెయిన్‌రోడ్డు, వెంకటాద్రినగర్ ఏరియా, వడ్డేపల్లి, పరిమళ కాలనీ, సప్తగిరి కాలనీ, ఆర్‌టీసీ కాలనీ, పోలీస్ కాలనీ, ఉషోదయ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

హెచ్‌సీయూ భూముల వేలం ఆపాల్సిందే..

- బీఆర్ఎస్, బీఆర్ఎస్‌వీ, సీపీఎం నాయకుల డిమాండ్
- జిల్లాలో పలుచోట్ల నిరసనలు
- కేయూలో తరగతులను బహిష్కరించిన ఏబీవీపీ నాయకులు

శాయంపేట : బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్‌వీ నేతలు

హనుమకొండ చౌరస్తా : కేయూలో తరగతులను బహిష్కరిస్తున్న విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా/కాజీపేట/శాయంపేట/ఐనవోలు, ఏప్రిల్ 2 : హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపివేయాలని ఏబీవీపీ కేయూ అధ్యక్షుడు మేరుగు సాయికుమార్ డిమాండ్ చేశారు. ఏబీవీపీ కేయూ శాఖ ఆధ్వర్యంలో అన్ని విభాగాల తరగతులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ రాజ్యం తెస్తామంటూ ప్రగల్భాలు పలుకుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను లాక్కోవడం విడ్డూరంగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి నీచ రాజకీయాలు మానుకోవాలని, వెంటనే 400 ఎకరాల భూమిని హెచ్‌సీయూ యాజమాన్యానికి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల దాడులు సరికాదని, రాబోయే రోజుల్లో విద్యార్థి లోకం ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నాయకులు ప్రశాంత్, పూజ, సంయుక్త, సాయి ప్రియ, శివ పాల్గొన్నారు. వర్సిటీ భూముల వేలం ఆపాలని సీపీఎం మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య డిమాండ్ చేశారు. కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట బుధవారం సీపీఎం మండల కమిటీ సభ్యుడు తొల్టె మల్లేశ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అక్రమంగా అరెస్ట్ చేసిన విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను అమ్ముకుని ఆదాయం సమకూర్చుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదన్నారు. ప్రభుత్వ భూముల్లో నిలువ నీడ లేని పేదలు గుడిసెలు వేసుకుంటే తగులబెట్టి, ఇప్పుడు సర్కారే రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఒడిగడితే ప్రజల ఆస్తులకు రక్షణ ఎక్కడ ఉందని విమర్శించారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించడంతో ఎస్ఎఫ్ఐ నాయకుడు నవీన్‌తో పాటు మరికొందరికి గాయాలయ్యాయన్నారు. ఉప్పనపల్లి నాగేశ్వర్‌రావు, కారు ఉపేందర్, జంపాల రమేశ్, సంటి రవి, దాసరి అనిత, మషిక భారతి, ఉమా పాల్గొన్నారు. బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ ఆధ్వర్యంలో శాయంపేట బస్టాండ్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. రేవంత్‌రెడ్డి పాలనలో పణ్యప్రాణులకు, విద్యార్థులకు రక్షణ కరువైందన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పుడు యూనివర్సిటీ భూములను అమ్మకానికి పెడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకులు అరికెళ్ల ప్రసాద్, కూతాటి రమేశ్, బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకుడు పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు అరికిల్ల వెంకట్, తట్ల సాయి, దైనంపల్లి రాజేశ్, శశి, మెండు నితిన్ పాల్గొన్నారు. వర్సిటీలో పోలీసు నిర్బంధాన్ని నిలిపివేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశాడు. ఐనవోలులో రాస్తారోకో నిర్వహించారు. మండల సభ్యులు దీకొండ ఉప్పలయ్య, గుండెకారి చిన్ని మహేందర్, గబ్బెట రామ్‌కుమార్ పాల్గొన్నారు. హెచ్‌సీయూ భూములను అమ్మాలని చూడడం అన్యాయమని బీఆర్ఎస్ సీనియర్ నేత చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. 400 ఎకరాల యూనివర్సిటీ భూములను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తుల చేతికి వెళ్లకుండా కాపాడిందన్నారు. ఈ నెల 3న చేపట్టనున్న సెక్రటేరియట్ ముట్టడిని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేశ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూములను కాపాడుకునే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను కార్పొరేట్ పరం చేయడానికి కుట్రల పన్నుతున్నదన్నారు. విద్యార్థుల ఉద్యమానికి ప్రజా సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు.

నకిలీ సర్టిఫికెట్‌తో ప్రభుత్వ ఉద్యోగం

జూనియర్ అసిస్టెంట్‌పై కేసు నమోదు

సుబేదారి, ఏప్రిల్ 2 : నకిలీ సర్టిఫికెట్‌తో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ఓ మహిళ అడ్డంగా దొరికిపోయింది. హనుమకొండ పోలీసుల కథనం ప్రకారం.. శాయంపేటకు చెందిన సిక్కుల సుజాత 2023లో జిల్లా ఉమెన్, చైల్డ్, డిసేబుల్ అండ్ సీనియర్ సిటిజన్(డబ్ల్యూసీడీఅండ్ఎస్‌సీ) డిపార్ట్‌మెంట్‌లో అకౌంటెంట్‌గా ఉద్యోగంలో చేరింది. పోలీసు నిఘా వర్గాల విచారణలో సుజాత పీజీ సర్టిఫికెట్ నకిలీ అని తేలింది. ఈ విషయం తెలుసుకొని సుజాత 2024 డిసెంబర్‌లో ఉద్యోగం మానేసింది. కాగా, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ శాఖ జిల్లా అధికారి రాజమణి ఫిర్యాదు మేరకు సుజాతపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : డీఎంహెచ్‌వో

రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

ఎల్కతుర్తి, ఏప్రిల్ 2 : రోగులకు మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో అప్పయ్య సూచించారు. బుధవారం మండలంలోని గోపాల్‌పూర్ పీహెచ్‌సీతో పాటు జీల్గుల, దండేపల్లి సబ్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. బీపీ, షుగర్ పేషెంట్లకు సరైన మందులు అందిస్తూ ఫాలో అప్ సేవలు చేయాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా గర్భిణులను ప్రోత్సహించాలని తెలిపారు. ఉప కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జీల్గుల, దండేపల్లిలో వ్యాధి నిరోధక టీకాల అమలును పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజేందర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ పాటించడం లేదు

కమలాపూర్, ఏప్రిల్ 2 : కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రొటోకాల్ పాటించడం లేదని తహసీల్దార్ సురేశ్ కుమార్‌కు బీజేపీ నాయకులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఎలాంటి పదవి లేని ఎన్నికల్లో ఓటమి పాలైన కాంగ్రెస్ నాయకుడు వొడితెల ప్రణవ్‌తో పంపిణీ చేయించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రేషన్ షాపుల వద్ద కాంగ్రెస్ నాయకుల ఫొటోలు, రేషన్ డీలర్ల మండలాధ్యక్షుడి ఫోటోలు పెట్టడం సరికాదన్నారు. రేషన్ డీలర్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నాయకులు తోట సురేశ్, భూపతి ప్రవీణ్, బండారి సుధాకర్, చెలికె శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రూప్-1 ఉద్యోగం సాధించిన మహ్మద్ విలాయత్

మహ్మద్ విలాయత్ అలీ

ఐనవోలు, ఏప్రిల్ 2 : కూలి పనులు చేసుకునే సామాన్య కుటుంబం నుంచి గ్రూప్-1 అధికారిగా మహ్మద్ విలాయత్ ఎంపికై సత్తా చాటాడు. పున్నేల్ గ్రామానికి చెందిన మహ్మద్ మహబూబ్ అలీ-షమీమ్ దంపతుల కుమారుడు మహ్మద్ విలాయత్ అలీ టీజీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాల్లో 489.5 మార్కులతో రాష్ట్రస్థాయిలో 86వ ర్యాంకు, మల్టీజోనల్ బీసీ-ఈ కేటగిరీలో మొదటి ర్యాంక్ సాధించాడు. తన చిన్నప్పటి కళ సహకారం కోసం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేసి గ్రూప్-1 సాధించాలని పట్టుదలతో చదువుకున్నాడు. అలీని అదే గ్రామానికి చెందిన జడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు ఉస్మాన్ అలీ సన్మానించారు.

ఎంపీడీవోగా రఘుపతిరెడ్డికి అదనపు బాధ్యతలు

ఐనవోలు, ఏప్రిల్ 2 : ఐనవోలు నూతన ఎంపీడీవోగా ఎంపీవో గోపు రఘుపతిరెడ్డి బుధవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా విధులు నిర్వర్తించిన పులి వెంకటేశ్వర్లు మార్చి 31న ఉద్యోగ విరమణ పొందగా, రఘుపతిరెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు.

ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల గడువు పెంపు

వరంగల్, ఏప్రిల్ 2 : ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు శుభవార్త అందించింది. ఎల్ఆర్ఎస్ ఫీజుల్లో 25 శాతం రాయితీ గడువు మార్చి 31తో ముగిసింది. ఈ క్రమంలో గడువును మరో నెల రోజులపాటు పొడిగిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఏప్రిల్ 30 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 రాయితీ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. గడువు పొడిగించడంతో బల్దియాకు కాసుల పంట పండనుంది. గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో లక్షకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అందులో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, ప్రభుత్వ భూములు, ఇప్పటికే భవనాల నిర్మాణాలు జరిగినవి పోను సుమారు 65 వేల మందికి ఫీజు ఇంటిమేషన్ లెటర్లు పంపించారు. మార్చి 31 గడువు ముగిసే నాటికి కార్పొరేషన్‌కు రూ. 94 కోట్ల ఆదాయం వచ్చింది. మరో నెల రోజుల గడువు పెంచడంతో సుమారు రూ. 500 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ..

ఆస్తి పన్ను చెల్లింపులపై ప్రభుత్వ 2025-25 ఆర్థిక సంవత్సరానికి 5 శాతం రాయితీ ప్రకటించింది. ఈ మేరకు సీడీఎంఏ టీకే శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఆస్తి పన్ను వసూళ్లలో పురోగతి సాధించాలనే ఉద్దేశంతో ఈ నెల 30 వరకు చెల్లించిన వారికి ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ ప్రకటించారు.

బల్దియాకు 13 మంది టీపీబీవోలు

వరంగల్ : బల్దియా టౌన్ ప్లానింగ్ విభాగానికి కొత్తగా 13 మంది టీపీబీవోలు వచ్చారు. వారిలో ఇప్పటి వరకు 8 మంది జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. కొంత కాలంగా సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఒక్కసారిగా 13 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. జాయినింగ్ రిపోర్టులు ఇచ్చిన వారు మొన్నటి వరకు ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌లలో విధులు నిర్వర్తించారు. వీరికి రెండు, మూడు రోజుల్లో డివిజన్లను కేటాయించనున్నారు. సిబ్బంది కొరతతో ఒక్కో టీపీబీబోలకు నాలుగు, ఐదు డివిజన్లను కేటాయించారు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన టీపీబీవోలకు డివిజన్లు కేటాయిస్తే పని ఒత్తిడి తగ్గే అవకాశాలు ఉన్నాయి.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి : మేయర్

వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి, అధికారులు

వరంగల్, ఏప్రిల్ 2 : వేసవిలో నగర ప్రజలకు తాగునీటికి ఇబ్బంది కలుగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్, ధర్మసాగర్ 1000 డయా పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా జరిగే వాల్వ్‌ను కడిపికొండ వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాంపూర్, ఖిలావరంగల్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయని తన దృష్టికి వచ్చిందని, వెంటనే సమస్యను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. లీకేజీల ద్వారా తాగునీరు వృధా అవుతున్న నేపథ్యంలో వెంట వెంటనే లీకేజీలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు శ్రీనివాస్, రవికుమార్, సంతోష్‌బాబు, మహేందర్, మాధవీలత, డీఈలు సారంగం, కార్తీక్‌రెడ్డి, ఏఈలు రామన్న, ముజామిల్, మేనక, హబీబ్ పాల్గొన్నారు. అలాగే గ్రేటర్ పరిధిలో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మేయర్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై డివిజన్ల వారీగా సమీక్ష నిర్వహించారు.

హైటెక్ వ్యభిచార ముఠా గుట్టు రట్టు

- నిర్వాహకురాలు, నలుగురు విటుల అరెస్ట్
- రూ.2450, ఐదు సెల్‌ఫోన్లు, కండోమ్ ప్యాకెట్ల స్వాధీనం

సుబేదారి, ఏప్రిల్ 2 : ఇంటిని అద్దెకు తీసుకొని ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. లేరు మండలం షోడాశపల్లి గ్రామానికి చెందిన తిమ్మాపురం లలిత సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలోని పోస్టల్ కాలనీలో ఇంటిని అద్దెకు తీసుకొని కొంతకాలంగా ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నది. పక్కా సమాచారంతో మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్, సుబేదారి పోలీసులు దాడులు చేసి జనగామ టౌన్‌కు చెందిన బంతిని అశోక్, జనగామ గుండ్లగడ్డ ప్రాంతానికి చెందిన బుక్క కర్నాకర్, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండకు చెందిన వడ్లకొండ రమేశ్, కాజీపేట విష్ణుపురికి చెందిన బొల్లి శ్రీనివాస్ ఇద్దరు మహిళలతో వ్యభిచారం చేస్తుండగా రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. విటులు, నిర్వాహకురాలు లలితను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2450, ఐదు సెల్‌ఫోన్లు, కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ తెలిపారు. ముఠాను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు, ఆర్ ఎస్సై భానుప్రకాశ్‌ను ఏసీపీ అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కాజీపేట, ఏప్రిల్ 2 : పట్టణంలోని ఓ దుకాణంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశారు. బుధవారం టాస్క్‌ఫోర్స్ సీఐ బాబులాల్ తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డేపల్లి వంద ఫీట్ల రోడ్డులో ఇంటి డోర్ డిజైనింగ్ దుకాణంలో కొంతమంది పేకాడుతున్నట్లు ఏసీపీ మధుసూదన్‌కు సమాచారం వచ్చిందన్నారు. ఏసీపీ ఆదేశాలతో సిబ్బందితో అక్కడికి వెళ్లి పేకాడుతున్న ఏడుగురిని పట్టుకున్నామని తెలిపారు. వారి నుంచి రూ.27,950, ప్లే కార్డులు, ఏడు సెల్‌ఫోన్ల ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు తుమ్మ రంజిత్‌రెడ్డి, గోపు రణధీ ర్‌రెడ్డి, తుమ్మ కిరణ్‌కుమార్ రెడ్డి, కన్నోజు విజయ్‌కుమార్, అల్లం మోహన్‌రెడ్డి, సకినాల పర్శరాములు, కటకం సుధాకర్‌రెడ్డిని కాజీపేట పోలీసులకు అప్పగించామని తెలిపారు.

మడికొండలో అంతర్రాష్ట్ర దొంగ..

మడికొండ : నగరంలో పలుచోట్ల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను బుధవారం మడికొండ పోలీసులు పట్టుకున్నారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కథనం ప్రకారం.. మడికొండలోని ఆర్ఎన్ఆర్ కాలనీలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఓ వ్యక్తి సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని సోదా చేయగా బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో స్టేషన్‌కు తరలించి విచారించగా మడికొండ వెస్ట్ సిటీ ప్రాంతంలో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి నుంచి సుమారు 60 గ్రాములు ఉన్న నల్లపూసల దండ, బంగారు చైన్, డైమండ్ లాకెట్ చైన్ స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ కార్ఖానకు చెందిన నిందితుడు కనగరాజు సాయిశ్రీధర్ మడికొండ పోలీస్ స్టేషన్‌తో పాటు మట్వాడ, కేయూసీ, కరీంనగర్ రూరల్, సూర్యాపేట జిల్లా చివ్వెంల పోలీస్ స్టేషన్ పధిలో దొంగతనాలు చేసినట్లు తెలిపారు. నేరస్థుడిని పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్సై రాజ్ కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ వరప్రసాద్, రఘు, టెక్నికల్ టీమ్ ఏఏవో సల్మాన్ పాషా, నగేశ్, ప్రవీణ్, వినయ్‌ను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

16 కిలోల గంజాయి స్వాధీనం

సుబేదారి, ఏప్రిల్ 3 : గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేసి, రూ.8లక్షల విలువైన 16కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. హనుమకొండ పోలీసుల కథనం ప్రకారం.. గుజరాత్‌కు చెందిన గౌతం భరత్ సింగ్ ఒడిశా నుంచి 16కిలోల గంజాయి బ్యాగుతో రైల్లో ముంబాయికి వెళ్తున్న క్రమంలో బుధవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేస్తున్నది గమనించి రైలు దిగాడు. సాయంత్రం వరంగల్‌లో బస్సు ఎక్కి హనుమకొండ బస్‌స్టేషన్‌లో బస్సు దిగి కాజీపేట రేల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ఆటో కోసం ఎదురు చూస్తున్నాడు. పోలీసులకు అనుమానం రావడంతో అతడి బ్యాగు తనిఖీ చేయగా, 16కిలోల గంజాయి దొరికింది.

బాధిత కుటుంబానికి పరామర్శ

సారమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పోచంపల్లి, తక్కళ్లపల్లి, పెద్ది

హసన్‌పర్తి, ఏప్రిల్ 2 : బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బండి రజినీకుమార్ తల్లి సారమ్మ ఇటీవల అనారోగ్యంతో మండలంలోని బైరాన్‌పల్లిలో మృతి చెందింది. బుధవారం ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్, తక్కళ్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సారమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వారి వెంట కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, సతీశ్‌రెడ్డి, నాయకులు వీరేందర్, నయీం, రవి, రాజేందర్ పాల్గొన్నారు.

'అవగాహన కార్యక్రమాలతో అటిజం నివారించొచ్చు'

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 2 : అవగాహన కార్యక్రమాలతో అటిజంను నివారించొచ్చని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్ అనితారెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ అటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. మల్లికాంబ సంస్థ వ్యవస్థాపకురాలు బండ రామలీల, సంస్థ సభ్యులు కోడం కల్యాణ్ ఉన్నారు.

ముగిసిన పది పరీక్షలు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 2 : జిల్లాలో పది పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి తెలిపారు. 67 కేంద్రాల్లో బుధవారం విద్యార్థులకు సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహించారు. మొత్తం 12,010 మంది విద్యార్థులకు 12,004(99.95 శాతం) మంది హాజరైనట్లు ఆమె తెలిపారు.

యాదవులు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకట్‌యాదవ్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 2 : రాష్ట్రంలో 10 శాతం ఉన్న యాదవులకు ఆత్మగౌరవం, హక్కులు, అధికారం ఉండాలని తెలంగాణ యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ అన్నారు. హనుమకొండలోని పలివేల్పుల విహారి కన్వెన్షన్ హాల్లో యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు దాసరి కోటేశ్వర్ అధ్యక్షతన శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన యాదవులు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అవగాహనతో ఉన్నత స్థానాలు అధిరోహించేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. శాసనసభలో ఆమోదించిన బీసీలకు 42 శాతం రిజ